నగరంలో పనుల పర్యవేక్షణ

ప్రజాశక్తి-కడప అర్బన్

నగరంలో అభివృద్ధి పనులను కమిషనర్ జి. సూర్య సాయి ప్రవీణ్ చంద్ మంగళవారం పర్యవేక్షించారు. మార్నింగ్ విజిట్‌లో భాగంగా 22వ డివిజన్ మారుతి నగర్, రాజీవ్ శృతి వనం పార్క్ డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, ఇన్‌ఛార్జి కార్పొరేటర్లు సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. రాజారెడ్డి వీధిలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికుల హాజరు పట్టికలను పరిశీలించారు. అనంతరం గార్బేజ్ పాయింట్లు శుభ్రం చేసి పాయింట్లలో చెత్త వేయకుండా తగు చర్యలు తీసుకోవాలని శానిటరి సెక్రటరీకి సూచించారు. మురుగు కాలువలో ప్లాస్టిక్ బాటిళ్లు కవర్లు, పలు వ్యర్థాలు వెంటనే తొలగించి నీటి ప్రవాహానికి ఎటువంటి ఆటంకం ఉండకుండా తగు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఆ ప్రాంతం ప్రజలతో మాట్లాడుతూ రోజూ చెత్త స్వీకరణ ఏ విధంగా జరుగుతుందో అడిగి తెలుసుకున్నారు. చెత్తను క్లాప్ వాహనాలలో వేసేలా చూడాలన్నారు.

పని చేయని ఎక్స్‌రే!

ఐదు కేంద్రాల్లో రెండింట్లోనే సేవలు
రెండు నెలలుగా అందని ఫిల్మ్‌లు
ప్రయివేటుకు రోగుల పరుగులు
పాలక మండలికి పట్టని వైనం

ఎక్స్‌రే కోసం నిరీక్షిస్తున్న రోగులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా సర్వజనాస్పత్రిలో ఎక్స్‌రే సేవలు పూర్తి స్థాయిలో అందడం లేదు. దేశంలోనే విస్తీర్ణంలో అతిపెద్ద ప్రభుత్వాస్పత్రిగా గుర్తింపు పొందిన ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఎక్స్‌రే సేవలు అధ్వానానికి చిరునామాగా మారాయని చెప్పవచ్చు. జిజిహెచ్‌లోని ఐదు ఎక్స్‌రే కేంద్రాలు ఉన్నాయి. ఒపి విభాగంలో మూడు, ఐపి విభాగంలో ఒకటి, మరోచోట ఒకటి చొప్పున ఐదు ఎక్స్‌రే కేంద్రాలను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఒపి విభాగంలో ఏర్పాటు చేసిన మూడు ఎక్స్‌రే కేంద్రాల్లో రెండు ఎక్స్‌రే కేంద్రాల్లోని క్యాసెట్ రీడర్లు (పిఆర్ మిషన్స్) రెండు నెలలుగా పని చేయడం లేదు. మిగిలిన ఎక్స్‌రే కేంద్రం సహాయంతో నెట్టుకొస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. దీనికి ఉన్నతాధికారులు, పాలకవర్గం సకాలంలో స్పందించకపోవడమే కారణమని తెలుస్తోంది. వీరినిర్వాకం పట్టణంలోని ప్రయివేటు ఎక్స్‌రే కేంద్రాలకు వరంగా మారిందని చెప్పవచ్చు. ప్రతి రోజూ జిజిహెచ్‌లో ఒపికి 1400 నుంచి 1600 మంది, ఐపి రోగులు 650 మంది కిపైగా వైద్యసేవలు పొందుతున్న సంగతి తెలిసిందే. రోజుకు కనిష్టంగా 250 మంది నుంచి గరిష్టంగా 450 మంది వరకు ఎక్స్‌రే సేవలు అందించాల్సి ఉన్నట్లు సమాచారం. రోగులకు ఎక్స్‌రే ఫిల్మ్‌లు ఇవ్వకుండా సెల్‌ఫోన్ల ద్వారా అందజేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతుండడం గమనార్హం. ఎక్స్‌రే కేంద్రాల్లోని క్యాసెట్ రీడర్లు పనిచేయని పరిస్థితుల నేపథ్యంలో ఎక్స్‌రే కేంద్రాల దగ్గర రోగులు పెద్దఎత్తున క్యూ కడుతున్న వైనం విస్మయాన్ని కలిగిస్తోంది. జిజిహెచ్‌లోని మూడు ఎక్స్‌రే కేంద్రాల్లో రెండు పనిచేయకపోవడంతో రోగులు ప్రయివేటు కేంద్రాలను ఆశ్రయిస్తుండడం గమనార్హం. జిజిహెచ్ ఉన్నతాధికారులు, పాలక మండలి నిర్లక్ష్యం కారణంగా మొన్నటి వరకు స్కానింగ్, తాజాగా ఎక్స్‌రే సేవల్లో నిర్లక్ష్యం కారణంగా రోగులు నిలువుదోపిడీకి గురవుతుండడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లా సర్వజనాస్పత్రిలోనే ఇటువంటి పరిస్థితులు ఉంటే కమ్యూనిటీ ఆస్పత్రులు, జిల్లాస్థాయి ఆస్పత్రి, ఏరియా ఆస్పత్రుల్లో ఎటువంటి పరిస్థితులు ఉంటాయో ఆలోచించాల్సి ఉంది. గతంలో జిజిహెచ్ బాధ్యతలను పర్యవేక్షించిన జాయింట్ కలెక్టర్, జిజిహెచ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ధ్యాన్‌చంద్ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒపి సేవల సదుపాయాన్ని కొనసాగించి రోగులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూసిన సంగతి తెలి సిందే. ప్రస్తుత జిజిహెచ్ పర్యవేక్షణ ఉన్నతాధికారి గత జాయింట్ కలెక్టర్ తరహా పనితీరును కనబరిస్తే సామాన్యుల ఇబ్బందులను పరిష్కరించిన వారవుతారనడంలో సందేహం లేదు. దీనిపై జిజిహెచ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్‌రావును సంప్రదించగా కొన్ని ఎక్స్‌రే కేంద్రాలు పనిచేయనిమాట వాస్తవమేనని, వాటి మరమ్మతు బాధ్యతలను చూస్తున్న సైరిక్స్ అనే కంపెనీ దృష్టికి తీసుకెళ్లామని పేర్కొనడం గమనార్హం.

విద్యా కానుక కిట్లను సిద్ధం చేయాలి

'నాడు-నేడు' పనులు సకాలంలో పూర్తి చేయాలి
విద్యా శాఖ సమీక్షలో జెసి గణేష్‌కుమార్

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జెసి గణేష్‌కుమార్

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి 'జగనన్న విద్యా కానుక"కిట్లను అన్ని పాఠశాలల్లో పంపిణీకి సిద్ధం చేయాలని, మనబడి 'నాడు-నేడు' పనులను ఈ నెల చివరి నాటికి పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ స్పందన హాలులో మనబడి 'నాడు నేడు' ఫేస్-2 పనుల పురోగతిపై సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్ రెడ్డితో కలిసి విద్యాశాఖ, ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ మండల స్థాయిలో ఎంఇఒలు, ఎపిఒలు వారి పరిధిలోని అన్ని పాఠశాలలకు విద్యా కానుక కిట్లలో ఏ ఒక్కటీ కొరత లేకుండా సిద్ధం చేయాలన్నారు. రెండవ దశ నాడు-నేడు పనులకు సంబంధించి 9 కాంపోనెంట్స్‌ను ఎంపిక చేసిన అన్ని పాఠశాలల్లో ఈ నెల చివరి నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పనులు పూర్తి చేసిన తర్వాతే అదనపు తరగతుల నిర్మాణాన్ని చేప ట్టాలన్నారు. నాడు-నేడు పనులను సంబంధిత ఇంజినీరింగ్ అధి కారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తూ నాణ్యతగా సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల నిర్వహణలో నాణ్యతా లోపాలుంటే అధికారులపై చర్యలు తప్పవన్నారు. పాఠశాలల అభివద్ధిలో భాగంగా ప్రభుత్వం నిర్ణయించిన 9 అంశాలకు సంబంధించి ఎక్కడ రాజీ లేకుండా నిర్ణీత గడువు లోపు పూర్తి చేయాలన్నారు. నిర్వహణలో వైఎస్ఆర్ జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు సంబంధితాధికారులు కృషి చేయాలన్నారు. విద్యార్థుల ఆరోగ్య భద్రతపై ప్రత్యేక దష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించి విద్యార్థుల్లో చదువుపై మక్కువ పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాథమిక పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. జిల్లాలో ఎక్కడా కూడా పిల్లల్లో పౌష్టికాహార లోపాలు కనిపించకుండా విద్యాశాఖ అధికారులు వైద్యాధికారుల సమన్వయంతో ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను జెసి ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి రాఘవ రెడ్డి, డిఆర్‌డిఎ పీడీ ఆనంద్ నాయక్, ఇంజినీరింగ్ అధికారులు, పంచా యతీరాజ్ ఎస్ఇ శ్రీనివాసుల రెడ్డి, ఎపి ఇడబ్ల్యుఐడిసి ఇఇ కరుణాకర్‌రెడ్డి ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇ వీరన్న, మండల ఇంజినీర్లు, మండల విద్యాశాఖ అధికారులు, సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారులు పాల్గొన్నారు.

గంజాయి ముఠా అరెస్టు : ఎస్‌పి

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి అన్బురాజన్

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు చేస్తున్న 10 మంది ముఠా సభ్యులను అరెస్టు చేసినట్లు ఎస్‌పి అన్బురాజన్ తెలి పారు. మంగళవారం పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఠా సభ్యుల నుంచి 22.3 కిలోల గంజాయి, ఆటో, స్కూటీ, మోటార్ సైకిల్, 7 సెల్ ఫోన్లు, రూ.48,800 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. గంజాయి చిన్న, చిన్న పొట్లాల్లో కట్టి విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. అరెస్టు అయిన నిందితులు ఇచ్చిన సమాచారంతో మరికొందరిపై నిఘా పెట్టామన్నారు. గంజాయి దాచి ఉంచినా, కొన్నా, అమ్మినా, అక్రమ రవాణా చేసినా, సహకరించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇటీవల కాలంలో దాదాపు 50 మందికి పైగా స్మగ్లర్లను అరెస్టు చేసి గంజాయి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. పదే, పదే అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారిపై పీడీ చట్టం ప్రయోగిస్తామని హెచ్చరించారు. గంజాయి విక్రమాలు, వినియోగించే వారి సమాచారం డయల్ 100, ఎస్‌పి 9440796900కు ఇవ్వాలని కోరారు. వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. అరెస్టు అయిన వారు ఫఠాన్ అఫ్జల్‌ఖాన్, పాణ్యం అశోక్‌కుమార్, పూల రాజేష్, పూల సరస్వతి, సయ్యద్, వర్ధన్, మహబూబ్‌బాష, జయకుమార్, రమేష్ ఉన్నారని తెలిపారు. నిందితలను అరెస్టు చేసి గంజాయి, వస్తువులు స్వాధీనం చేసుకున్న అడిషనల్ ఎస్‌పి తుషార డూడి, డిఎస్‌పి షరీఫ్, సిఐ, ఎస్ఐ, సిబ్బందిని అభినందించారు.

ఉద్యోగాలు భర్తీ చేయాలి

కడప అర్బన్ : రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2.30లక్షల ఉద్యోగాలు వెంటనే భర్తీ చేయాలని యువజన, విద్యార్థి, నిరుద్యోగులు హెచ్చరించారు. మంగళవారం ఎస్‌టియు భవన్‌లో ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిరుద్యోగ సమస్యలపై చర్చా వేదిక ఏర్పాటు చేశారు. ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ద్రవిడ సురేష్, జిల్లా అధ్యక్షులు బి.దస్తగిరి, ఉద్యోగ పోరా సమితి రాష్ట్ర కన్వీనర్ షేక్.సిద్ధిక్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి శివకుమార్, తెలుగు యువత జిల్లా అధ్యక్షులు పుత్తా ఎల్లారెడ్డి, జియా ఉద్దీన్, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జయ వర్ధన్, ఆర్ఎస్‌వైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శంకర్, నిరుద్యోగులు సుబ్బరాజు, రెడ్డెప్ప, కిషోర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు ప్రసంగించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఏడాది జనవరి ఒకటిన జాబ్ కేలెండర్ ప్రకటిస్తామని ఇచ్చిన హామీ అమలు చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. నాలుగు సంవత్సరాలుగా నిరుద్యోగులు అప్పు చేసి హాస్టళ్లలో ఉంటున్నారని తెలిపారు. ఉద్యోగ భర్తీ డిమాండ్‌తో ప్రచార కార్యక్రమాలు, సదస్సులు, ధర్నాలు, విజయవాడలో నిరుద్యోగుల ధర్నా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు సి.శివ నాగేంద్ర, ఎఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి శివ, తెలుగు యువత నాయకులు నాగరాజు, యూత్ కాంగ్రెస్ నాయకులు వంశీ, యువజన, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, నిరుద్యోగులు హాజరయ్యారు.

అమీర్‌బాబుకు సన్మానం

కడప అర్బన్ : కువైట్‌లో నిర్వహించిన ఎన్‌టిఆర్ శత జయంతి ఉత్సవాల్లో పాల్గొని కడపకు తిరిగి వచ్చిన అమీర్‌బాబును మంగళవారం తెలుగుయువత నగర అధ్యక్షులు మేకల వెంకటేష్ యాదవ్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నూర్‌బాష, 47వ డివిజన్ ఇన్‌ఛార్జి జనార్ధన్‌రెడ్డి, 5వ డివిజన్ ఇన్‌ఛార్జి బండి జయశేఖర్, షేక్.గౌస్, ఇస్మాయిల్, అహమ్మద్, తరుణ్, పవన్, అమీర్‌బాష, ఆరీఫ్, మహమ్మద్, ఇస్మాయిల్, వినయ్, వంశీ, చరణ్, రాజేష్, ప్రసాద్‌బాబు, అమర్, చంద్రశేఖర్, మున్నా, గౌస్‌బాష, అహమ్మద్ పాల్గొన్నారు.

జెవివి వేసవి వినోదం

కడప అర్బన్ : జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యాలయంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్ మంగళవారం నాటికి 16వ రోజుకు చేరుకుంది. జెవివి రాష్ట్ర నాయకులు ఎ.డి.దేవదత్తం పర్యవేణలో రీసోర్స్ పర్సన్ జానకిరామ్ మ్యాథ్స్ నేర్పించారు. ఆటలు అడించారు. పాటలు, మోటివేషన్ తరగతులు, డ్యాన్స్ ప్రాక్టీస్ చేయించారు.

ఇంటింటికీ బిఎస్‌పి

కడప అర్బన్ : జిల్లాలో ఇంటింటికీ బిఎస్‌పి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఇన్‌ఛార్జ్ సగిలి గురప్ప పిలుపు నిచ్చారు. మంగళవారం బిఎస్‌పి జిల్లా కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులు బక్క పరంజ్యోతి ఆదేశాల మేరకు జూన్ 10 వరకు ఇంటింటికి బిఎస్‌పి నిర్వహించనున్నామని తెలిపారు. ప్రజలకు బిఎస్‌పి సిద్ధాంతాన్ని తెలియ జేస్తామని పేర్కొన్నారు. జూన్ 10 నాటికి గ్రామ, బూత్ కమిటీలు పూర్తి చ ేస్తామని చెప్పారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.ఎస్ .జయరాం, జి.ఓబయ్య, ఉపాధ్యక్షులు బాలచంద్ర, నాయకులు పాల్గొన్నారు.

'సజ్జల' దృష్టికి 'గురుకుల' సమస్యలు

ప్రజాశక్తి-పోరుమామిళ్ల టౌన్

సజ్జల రామృష్ణరెడ్డితో ఉద్యోగుల సంఘం నాయకులు

ప్రభుత్వ సల హాదారులు సజ్జల రామకృష్ణరెడ్డికి డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ గురుకుల ఉద్యోగుల సమస్యలు పరి ష్కరించాలని వినతిపత్రం అందజేసినట్లు గురుకుల ఉద్యోగుల సంఘం నాయ కులు గురురత్నం తెలిపారు. మంగళవారం వైఎస్ఆర్ గురుకుల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు నజురుల్లా, సంఘ సభ్యులు విజయవాడలో సజ్జలను కలిసి సమస్యలు విన్నవించారు. రెగ్యులర్ ఉద్యోగులకు 60 సంవత్సరాల నుండి 62 సంవత్సరాల వయో పరిమితి పెంచాలన్నారు. 16 సంవత్సం ాలనుండి పని చేస్తున్న కాంట్రాక్టు టీచర్స్‌ను రెగ్యులర్ చేయాలని, వేతనం పెంచాలని పేర్కొన్నారు. కార్యక్ర మంలో రాష్ట్ర యూనియన్ నాయకులు తులసి రామ్, రామచంద్రారెడ్డి, గురు రత్నం, అమరనాథ్ రెడ్డి, మురగా రెడ్డి, తిరుపాల్, ప్రవీణ్, జాన్సీ, అంజనీ, చిన్నయ్య, నరేంద్ర, శ్రీ హరి, రవి, రవి కుమార్ పాల్గొన్నారు.

ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధం : సోమిరెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

మాట్లాడుతున్న మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

ఎప్పుడు ఎన్నిక లొచ్చినా తాము సిద్ధంగా ఉన్నామని టిడిపి మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డి అన్నారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యా లయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహి ంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడితే ఆ భగవంతుడు కూడా కాపాడలేడని అన్నారు. ఈ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల వల్ల ప్రజలు నారా లోకేష్‌కు పాదయాత్రలో గోడు వెళ్ళబో సుకుంటున్నారని తెలిపారు. బలహీన వర్గాల ప్రజలపై దాడులు జరిగాయని, వైసిపి నేతలు చేస్తున్న అవినీతికి సమాధానం చెప్పలేక, దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. లోకేష్ పాదయాత్ర చేస్తే తమకేంటి అన్న వైసిపి మంత్రులు, లోకేష్ పాదయాత్రకు ప్రజాదరణను చూసి ఓర్వలేక చేసిన కుట్రలు పటా పంచలయ్యాయన్నారు. పీకే సలహాతో అధికారంలోకి వచ్చిన జగన్, చంద్ర బాబును ఏం చేస్తారని ప్రశ్నించారు. టిడిపి మాజీ మంత్రి అమర్‌నాథరెడ్డి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వానికి కాలం దగ్గర పడుతున్న కొద్దీ తప్పుడు కేసులు ఎక్కువ అయ్యాయని పేర్కొన్నారు. . కడప జిల్లాలో వచ్చేనెల నిర్వహించబోయే యువ గళం నారా లోకేష్ పాదయాత్రను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మల్లెల లింగారెడ్డి, రాష్ట్ర నాయకులు గోవర్ధన్, హరి ప్రసాద్, ఎస్టీ సెల్ మేదర రవికుమార్, బండి జయ శేఖర్ పాల్గొన్నారు.

హామీల అమలు కోసమే రిలే నిరాహార దీక్షలు

కడప అర్బన్ : ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలను అమలు చేయాలనే డిమాండ్‌తో రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి రఘురామ రాయుడు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమేష్ కుమార్ సుదర్శన్ రెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. 22న ప్రొద్దుటూరు, 23న సిద్ధవటం, 25న పులివెందుల, 26న బద్వేల్, 27న జమ్మలమడుగు, 29న కమలాపురం, 31న కడపలో దీక్షలుంటాయని తెలిపారు. ఉద్యోగులు ఉపాధ్యాయులు పాల్గొని జయప్రదం చేయాలని పేర్కొన్నారు.

అందరి సహకారంతో అధికారంలోకి వస్తాం

ప్రజాశక్తి- పోరుమామిళ్ల టౌన్

ప్రజల సహకారంతో రాబోవు ఎన్నికల్లో విజయం సాధించి, అధికారంలోకి వస్తామని బద్వేలు నియోజకవర్గ యువ నాయకులు రితీష్ కుమార్ రెడ్డి అన్నారు. తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర సోమవారం నాటికి వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా పోరుమామిళ్ల పట్టణంలో ఆంజనేయ స్వామి గుడి వద్ద నుంచి కమ్మవారిపల్లె వరకు సంఘీభావ పాదయాత్ర తెలుగుదేశం పార్టీ యువ నాయకులు చెరుకూరి రవి కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ బద్వేల్ యువ నాయకులు రితీష్ కుమార్ రెడ్డి కార్యక్ర మంలో పాల్గొన్నారు. పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని, తెలుగుదేశం వర్ధిల్లాలి, చంద్రబాబునాయుడు వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. బ్యాండ్ మేళాలతో బాణ సంచా పేలుస్తూ తెలుగు తమ్ముళ్ళు ఉత్సాహంగా పాదయాత్రను నిర్వహించారు. పోరుమామిళ్ల, బి.కోడూరు, కలసపాడు, కాశినాయన మండలాల నుండి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. కార్యక్రమంలో బద్వేల్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ యువ నాయకులు చెరుకూరు రవి, పోరుమామిళ్ల సర్పంచ్ సుధాకర్, తెలుగుదేశం పార్టీ నాయకులు రామ సుబ్బారావు, షరీఫ్, బాషా, ఇమామ్ హుస్సేన్, సీతా వెంకటసుబ్బయ్య, చిన్న వెంకటసుబ్బయ్య, వెంకటేశ్వర్లు, బైరవ ప్రసాద్, మస్తాన్, ప్రొఫెసర్ బాష, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాదయాత్ర నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

మెరుగైన వైద్య సేవలకు కృషి

- రిమ్స్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.సురేఖ

హెచ్ఒడిల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.సురేఖ

ప్రజాశక్తి-కడప సిటీ

ప్రజలకు మరింత మెరుగ్గా అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కడప ప్రభుత్వ సర్వజన వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏ సురేఖ అన్నారు. ప్రభుత్వ సర్వజన వైద్యకళాశాలలోని కాన్ఫరెన్సు హాల్‌లో మంగళవారం అన్ని విభాగాల హెచ్ఒడిలతో సమీక్ష నిర్వహి ంచారు. ఈ సంద ర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి నిరంతరం మెరుగైన వైద్య సేవలను అందించేందుకు ప్రతి వైద్యుడూ, సిబ్బంది కృషి చేయాలన్నారు. వైద్యులు, అధికారుల పనితీరుపై పర్యవేక్షణను ఆయా విభాగాల హెచ్ఒ డిలే చేయాలని తెలిపారు. ప్రతి ఉద్యోగీ తప్పనిసరిగా ఎఫ్ఆర్ఎస్ బయోమెట్రిక్ విధానాన్ని పాటించాలన్నారు. రోగులకు మైక్రో బయాలజీ, పెథాలజీ, బయో కెమిస్ట్రీ, రేడియాలజీ విభాగాలకు సంబంధించిన పరీక్షలను ఎప్పటిక ప్పుడూ నిర్వ హించాలన్నారు. వారికి ఇచ్చే రిపోర్టుల ఆధారంగా వైద్యులు అవసరమైతే ఏ రోజు కా రోజు మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు వైద్య సేవలు అందిం చేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. సూప రింటెం డెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జనరల్ మెడిసిన్, సర్జరీ విభాగాలతో పాటు ఇతర విభాగాల్లో ఓపి, ఐపీ సేవలను విస్తృతంగా అంది ంచాలన్నారు. ప్రధానంగా వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీ సేవలను కూడా పకడ్బందీగా నిర్వహిం చాలన్నారు. గైనకాలజీ విభాగం హెచ్ఒడి డాక్టర్ లక్ష్మి సుశీల మాట్లాడుతూ తమ విభాగంలో కాన్పులకు వచ్చే రోగులకు ఇతర స్త్రీ సంబంధిత వ్యాధులకు వైద్య సేవలను విస్తృతంగా చేస్తు న్నామన్నారు. తమకు వైద్యుల సిబ్బంది కొరత ఎక్కు వగానే ఉందన్నారు. పడకల సంఖ్య కూడా పెంచాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది పని సమయాలను ఎప్పటి కప్పుడూ పర్యవేక్షిస్తుంటామని డాక్టర్ శ్రీనివాసులు తెలియజేశారు. పని పనితీరును మెరుగు పరచుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.



ఆర్‌జెడికి వినతి పత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రభుత్వ ఉపాధ్యాయునిగా ఉంటూ మోసాలు చేయడంతో పాటు, ఆర్థిక నేరాలకు పాల్పడుతున్న తొండూరు మండలం, అగడూరు గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (సోషల్ స్టడీస్) గా పనిచేస్తున్న నంద్యాల వెంకట గంగరాజును తక్షణమే ఉద్యోగ విధుల నుంచి తప్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సగిలి రాజేంద్ర ప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం పాఠశాల ఆర్‌జెడి ఛాంబర్‌లో కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సగిలి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ తొండూరు మండలం, ఆగడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న నంద్యాల వెంకట గంగరాజు ఈఏడాది జనవరి 24, 29 తేదీల్లో కడప నగరంలో ఉన్న నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్‌కు వెళ్లి తాను విజిలెన్స్ అధికారిగా పరిచయం చేసుకుని, అక్కడ సరైన సౌకర్యాలు లేవని సాకు చూపి రూ.5 లక్షలు ఇవ్వాల్సిందిగా బెదిరింపులకు పాల్పడ్డారని తెలిపారు. సదరు సంస్థ వారు నకిలీ విజిలెన్స్ అధికారిగా గుర్తించి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. ఈ మేరకు సిఐ నాగరాజు విచారించి వెంకట గంగరాజు పై కేసు నమోదు చేశారని చెప్పారు. అతనిపై చర్యలు తీసుకోవడంలో విద్యాశాఖ అధికారులు వైఫల్యం చెందారన్నారు. తక్షణమే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బుక్కే సురేష్ నాయక్ పాల్గొన్నారు.

సర్వే రాళ్లను తొలగిస్తే శిక్షార్హులు

కడప : ఆంధ్రప్రదేశ్ సర్వే, సరిహద్దుల చట్టం -1923 పాత సర్వేలో ఉన్న రాళ్లను కానీ, రీ సర్వే పూర్తి చేసిన తర్వాత నాటిన రాళ్లను కానీ పెకిలిస్తే ఆంధ్రప్రదేశ్ సర్వే, సరిహద్దుల చట్టం -1923 లోని సెక్షన్ 15 (2) ప్రకారం శిక్షార్హులు అవుతారని జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ తెలిపారు. వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూపక్కు, భూ రక్షణ పథకం కింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 100 సంవత్సరాల వ్యవసాయ భూములు, గ్రామకంఠం స్థిరాస్తుల సర్వే చేపట్టిన విషయం అందరికీ తెలిసిందే అని తెలిపారు. అందులో భాగంగా వైఎస్ఆర్ జిల్లాకు సంబంధించి మొత్తం 735 గ్రామాలకు గాను మొదటి విడతలో 85 గ్రామాలకు సర్వే సరిహద్దు రాళ్లను నాటడం పూర్తి అయినట్లు తెలిపారు. ప్రభుత్వం నాటించిన సర్వే రాళ్లను ఎవ్వరు తీసివేయరాదని చెప్పారు

విద్యాకానుక కిట్లను పరిశీలిస్తున్న ఆర్‌జెడి, ఎఎస్‌ఎ పిఒ

ప్రారంభం రోజు నుంచే విద్యా కానుక పంపిణీ

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

పాఠశాల తెరిచే నాటికి జగనన్న విద్యా కానుక ప్రతి విద్యార్థికి అందించాలని ఆర్‌జెడి వెంకట కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న జగనన్న విద్యాకనుక స్టాక్ పాయింట్‌ను జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి ప్రభాకర్ రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల ప్రారంభం నాటికి ప్రతి విద్యార్థికీ విద్యా కానుక అందించేలా చర్యలు తీసుకోవాలని వారు పేర్కొన్నారు. అనంతరం జగనన్న విద్యా కానుక స్టాక్ పాయింట్‌లో ఉన్న డిక్షనరీసు, టెస్ట్ బుక్స్ అదే విధంగా ఏక రూప దుస్తుల నాణ్యతను పరిశీలించారు. 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు రెమిడీయల్ క్లాసెస్‌కు హాజరైన వారితో సమా వేశమై ప్రతి విద్యార్థి సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వారి వెంట సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు మిట్టా కేశవరెడ్డి, కొండా దశరథ రామి రెడ్డి, స్థానిక మండల విద్యాశాఖ అధికారి వెంకట్రామిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇషాన్ చిన్నపిల్లల ఆస్పత్రికి నోటీసులు

ప్రజాశక్తి- కడప అర్బన్

ఇషాన్ చిన్న పిల్లల ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ ఓబుల్‌రెడ్డి ఆరు నెలల వరకు ఎలాంటి వైద్యం చేయకూడదని ఎపి మెడికల్ కౌన్సిల్ బోర్డు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఉత్తర్వుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శిస్తూ వైద్యం అందిస్తున్నారనే ఫిర్యాదులో వైద్య ఆరోగ్య అధికారి ఆదేశాల మేరకు విచారణ అధికారి, సభ్యులు మంగళవారం ఆసుపత్రిని తనిఖీ చేశారు. డాక్టర్ ఓబుల్‌రెడ్డి విజయవాడకు వెళ్లినట్లు అక్కడ ఉన్న డ్యూటీ డాక్టర్, ఎఒ పేర్కొన్నారు. వారి చేత అధికారి సంతకం తీసుకుని ఆసుపత్రిలోని డాక్టర్ తలుపునకు అతికించారు. 6 నెలలు ఆసుపత్రిలో పని చేయకూదని, ఎటువంటి లెటర్ ప్యాడ్స్, ఒపి స్లిప్స్, అడ్మిషన్ కేషీట్స్ ఉండ కూడదని చెప్పారు. డాక్టర్ ఓబుల్‌రెడ్డి వచ్చిన వెంటనే వైద్య ఆరోగ్యశాఖలో కలవాలని అక్కడి సిబ్బందికి తెలిపారు. అర్హత కలిగిన డాక్టర్లు కాక వేరే వారితో చికిత్స చేయించకూడదని సిబ్బందికి హెచ్చరికలు జారీ చేశారు.

సదరన్ క్యాంపు నిర్వహించాలి : సిపిఎం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు ప్రభుత్వాసుపత్రిలో ప్రతి వారం సదరన్ క్యాంపు క్రమం తప్పక నిర్వహించాలని సిపిఎం జమ్మలమడుగు కార్యదర్శి వీరనాల శివనారాయణ తెలిపారు. స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెండు మూడు వారాలుగా సదరన్ క్యాంపులు నిర్వహించడంలేదన్నారు. దీనిపై విభిన్న ప్రతిభావంతులు సోమవారం ఆందోళన చేసిన విషయం విదితమేనని తెలిపారు. తమ అవసరాల కోసం, ప్రభుత్వ సంక్షేమ పథకాల మంజూరుకు విభిన్న ప్రతిభావంతులకు సర్టిఫికెట్ అవసరమన్నారు. సుదూర ప్రాంతాలు, ఇతర జిల్లాల నుండి వందల కిలో మీటర్ల దూరం నుండి వస్తున్నారన్నారు. అలాంటివారిపై అధికారుల నిర్లక్ష్యం సరైందికాదన్నారు. ఆర్థోపెడిక్ డాక్టర్‌ను ప్రభుత్వం త్వరగా నియమించాలని కోరారు. సమావేశంలో సిపిఎం నాయకులు శ్రీను, ధనుంజయ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం నాయకులు శివనారాయణ

జగన్ పాలనలో వడ్డింపులు, వాయింపులే

- పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

వైసిపి ప్రభుత్వంలో వడ్డింపు, వాయింపులేనని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. మంగళవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తేలుకొండి పాత్రను జగన్ ప్రభుత్వం బహు సమర్థవంతంగా నిర్వహిస్తోందని విమర్శించారు. జగన్ పాలనలో రవాణా రంగం కుదేలైందన్నారు. ఇప్పటికే వాహనాల త్రైమాసిక పన్ను పొరుగు రాష్ట్రాల కంటే 30 శాతం అధికంగా ఉందన్నారు. పెట్రోల్, డీజిల్ మీద వ్యాట్ అన్ని రాష్ట్రాల కంటే ఎపిలోనే ఎక్కువన్నారు. గ్రీన్ టాక్స్‌ను రూ.200 నుండి రూ.20 వేలకు పెంచిందని తెలిపారు. గోరుచుట్టు మీద రోకటి పోటులా రవాణా వాహనాల త్రైమాసిక పన్నును 25 శాతం పెంచుతూ 2023 మే 12న జిఒ 31న జారీ చేయడం దురదృష్టకరమని తెలిపారు. దీనివల్ల సరకుల ధరలు, బస్సు ఛార్జీలు పెరుగుతాయన్నారు. ప్రజలపై ఏటా రూ.250 కోట్లు అదనపు భారం పడుతుందని చెప్పారు. చాక్లెట్ ఇచ్చి నెక్లీస్ లాక్కొన్నట్లుంది వైసిపి పాలన తీరు అన్నారు. ప్రజా వ్యతిరేక జిఒ 31ని వెంటనే ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోందన్నారు.

ఐటిఐలో ప్రవేశానికి దరఖాస్తులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

స్థానిక ప్రభుత్వ ఐటిఐలో వివిధ కోర్సుల్లో ప్రవేశానికి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ నవరూప్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, సివిల్, మోటర్ మెకానిక్, డీజిల్ మెకానిక్, వెల్డర్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. పదవ తరగతి పాస్ లేదా ఫెయిల్, 8వ తరగతి పాస్ అయిన అభ్యర్థులు వారి వివరాలను ఆన్‌లైన్‌లో జూన్ 6లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పద్యాల్లోని విలువలతో జీవితం పరిమళిస్తుంది

- రచయిత డి.కె.చదువులబాబు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

పద్యాలలోని విలువలతో జీవితం పరిమళిస్తుందని రచయిత, తెలుగు భాషోపాధ్యాయుడు డి.కె.చదువులబాబు పేర్కొన్నారు. మంగళవారం పౌరగ్రంథాలయ శాఖ ఆదేశాల మేరకు ప్రొద్దుటూరు పట్టణంలోని పుట్టపర్తి నారాయణాచార్యులు ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న శిక్షణా శిబిరంలో ఆయన మాట్లాడుతూ పద్యాలలోని మంచిని గ్రహించి ఆచరిస్తే జీవితం ఎంతో బాగుంటుందన్నారు. వేమన, సుమతి, తెలుగుబాల మొదలగు పద్యాలు వినడం, పలకడం, చదవడం, రాయడం వల్ల శ్రవణం, భాషణం, పఠనం, లేఖనం మొదలగు సామర్థ్యాలను విద్యార్థులు అభివృద్ధి చేసుకోవచ్చునని వివరించారు. గజ్జెల వెంకటేశ్వరరెడ్డి బాలల గేయాలను పాడి విద్యార్థులతో పలికించారు. శ్రీకాంత్ స్పోకెన్ ఇంగ్లీషులో శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయం అధికారిణి తిరుపతమ్మ, జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు చంద్రశేఖర రావు, సంజీవరెడ్డి, గ్రంథాలయ హెల్పర్ జె.గంగాదేవి పాల్గొన్నారు.

పులివెందుల అభివృద్ధి బిటెక్ రవికి కనబడలేదా..?

-విమర్శలు చేసేటప్పుడు స్థాయి ఏంటో తెలుసుకోవాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

రాజకీయం కోసం పులివెందుల ప్రజలను కించ పరిచేలా మాట్లాడితే సహించేది లేదని మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, రాష్ట్ర సివిల్ సప్లయ్ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజ్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ సర్వోత్తమ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ ఏమి జరిగినా దానికి పులివెందుల గుండాలు, రౌడీలు కారణం అని అవమానిస్తూ పులివెందుల ప్రజలను అప్రతిష్టపాలు చేస్తున్నావ్.. త్వరలోనే మీ అధినేతలకు కూడా పులివెందుల ప్రజలు తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. గోవా, శ్రీలంక తదితర ప్రాంతాల్లో కాదు.. పులివెందుల చుట్టూ రోడ్లపై తిరిగితే అభివృద్ధి ఏంటో కనిపిస్తుందని మాజీ ఎమ్మెల్సీ బిటెక్ రవీంద్రారెడ్డిని ఉద్దేశించి పేర్కొన్నారు. పులివెందుల అభివృద్ధి నువ్వు చెప్పే కుప్పం, పీలేరు స్థాయి దాటి దేశీయ స్థాయిలోనే ఒక మోడల్ సిటీ తరహా అన్నారు. అందుకు సంబంధించి అన్ని సాక్ష్యాలతో ఎక్కడైనా బహిరంగ చర్చకు సిద్ధమన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు అంకాలమ్మ దేవస్థానం చైర్మన్ బ్యాటరీ ప్రసాద్, కౌన్సిలర్లు కోడి రమణ, పార్నపల్లి కిషోర్, సోపాల వీర, రాజేష్, నూరుల్లా ఉన్నారు.

మాట్లాడుతున్న వైసిపి నాయకులు

పూర్తయిన జగనన్న కాలనీలకు విద్యుత్ కనెక్షన్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

పూర్తయిన జగనన్న కాలనీలకు వెంటనే విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని ఎపిఎస్‌పిడిసిఎల్ ఎస్‌సి రమణ ఆదేశించారు. స్థానిక విద్యుత్ కార్యాలయంలో మంగళవారం ఆయన విద్యుత్ అధికారులతో డివిజన్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ డివిజన్ పరిధిలో జగన న్న కాలనీ ఎక్కడైనా పూర్తయిన వెంటనే జాప్యం లేకుండా విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలన్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను రిలీజ్ చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ ఫీడర్లలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. విద్యుత్ బకాయి వసూళ్లపై శ్రద్ధ పెట్టాలన్నారు. బకాయి పేరుకుపోయేకొద్దీ సమస్యలు ఉత్పన్నమవుతాయని, వీటిపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ నష్టాలు తగ్గించాలన్నారు. డెవలప్‌మెంట్ ఛార్జెస్ వసూలుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంతకుముందు విద్యుత్ అధికారులు రమణకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి స్వాగతం పలికారు. సమావేశంలో ఇఇ శ్రీనివా సులరెడ్డి, డిఇఇలు ప్రతాపరెడ్డి, నరసింహారెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఎఇలు పాల్గొన్నారు.

రమణకు స్వాగతం పలుకుతున్న విద్యుత్ అధికారులు

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని వీరన్నగట్టుపల్లి గ్రామ పొలాల మామిడి తోటల్లో మంగళవారం గుర్తు తెలియని పురుషుని మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ తిరుపేల్ నాయక్ తెలిపారు. వీరన్నగట్టుపల్లెలో ఉన్న మామిడితోట యజమాని ఇచ్చిన సమాచారమేరకు వెళ్లామని ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పరిశీలించామన్నారు. మామిడి చెట్లకు వారం క్రితం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకోవడంతో శరీరం దుర్వాసన వస్తున్నట్లు తెలిపారు. చనిపోయిన వ్యక్తికి వయసు దాదాపు 40–50 మధ్య ఉంటుందన్నారు. మృతుడు బట్టతలతో నలుపు రంగు ప్యాంట్, స్కై కలర్ బ్లూ షర్టు, రెడ్, బ్లాక్ కలర్ బెల్టు ధరించి ఉన్నాడని తెలిపారు. ఆచూకీ తెలిసినవారు వేంపల్లె పోలీసుల 91211 00550, 94409 38046 నెంబర్లకు సమాచారమివ్వాలని ఆయన కోరారు.

ఏళ్లు గడుస్తున్నా తీరని సమస్యలు

ముంపుగ్రామాల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత.. ప్యాకేజీ ఎప్పుడిస్తారో?

ప్రజాశక్తి - కొండాపురం

గండికోట ప్రాజెక్టు ముంపు గ్రామాల ప్రజలకు ప్రభుత్వం కేటాయించిన పునరావాస కాలనీల్లో ఏళ్లు గడుస్తున్నా వారి సమస్యలు తీరడం లేదు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానికులు పలుమార్లు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినా సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. విద్యుత్, తాగునీరు, శ్మశానవాటికల సమస్యలు అలాగే ఉన్నాయి. ఈనేపథ్యంలో తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పునరావాస కాలనీల్లో ఎమ్మెల్యే పర్యటనకు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. అధికారులు ఆయా కాలనీల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టడం లేదని ఆరోపిస్తున్నారు. పునరావాస కాలనీల్లో కనీస వసతుల కల్పనలో జగన్ ప్రభుత్వం విఫలమైందనే విమర్శలున్నాయి. గతంలో తమ పాత గ్రామాల్లో ఉన్నట్లు పాఠశాలలు, దేవాలయాలు, శ్మశానవాటికల సవతులతోపాటుగా ముంపువాసులకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన రూ.3.25లక్షల పరిహారం, పెండింగులో ఉన్న చెక్కులు త్వరగా ఇవ్వాలని కోరుతున్నారు. లేకపోతే 2024 ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓట్లు వేస్తామని స్థానికులు పేర్కొంటున్నారు. ఎన్నికల కోడ్ విడుదలయ్యే నాటికైనా ముంపువాసుల సమస్యలు పరిష్కారం కావాల్సిన అవసరం ఉంది.

పట్టని ప్రజా సమస్యలు : మండలంలో ప్రతి ఇళ్లు తిరిగే నాయకులకు ప్రజా సమస్యలు పట్టడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. మంచి పనులు చేశామని ప్రభుత్వం గడపగడపకు మన ప్రభుత్వం పేరుతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాప్రతినిధులను ప్రతి ఇంటికి పంపిస్తున్నారు. ప్రభుత్వం ద్వారా వారికందిన లబ్ధిని వివరిస్తున్నారు. అదే తరహాలో ప్రతిపక్ష టిడిపి ఇదేం ఖర్మ మనరాష్ట్రానికి అంటూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రతి గడపకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేస్తున్నారు. అంతేగానీ కొండాపురం మండలంలో నిర్మించిన గండికోట ప్రాజెక్టు ముంపునకు గురైన 22గ్రామాల ప్రజల సమస్యలపై ఏ పార్టీ వారు స్పందించడంలేదనే ఆరోపణలున్నాయి. ముంపు గ్రామాల ప్రజల త్యాగం మరువలేనిదని సిఎం ప్రశంసించారే తప్ప, తమ సమస్యల పరిష్కారం, అభివృద్ధి పట్టించుకోలేదనే విమర్శలు చేస్తున్నారు. టిడిపి వారు తమ సమస్యలపై ఆందోళనలు చేసిన దాఖలాల్లేవని ఆవేదన చెందుతున్నారు. ఆయా పార్టీల నాయకులు తమ రాజకీయ మనుగడ కోసమే ప్రతి ఇల్లు తిరుగుతున్నారనే విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికైనా తమ సమస్యల పరిష్కారానికి, అభివృద్ధికి అధికారపార్టీ, ప్రతిపక్షపార్టీ కృషి చేయాలని ముంపువాసులు కోరుతున్నారు.

డెంగీ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి మనోరమ

ప్రజాశక్తి - కడప అర్బన్

డెంగీ వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య ఆరోగ్యశాఖ ఆర్‌డి డాక్టర్ కోటేశ్వరమ్మ అన్నారు. మంగళవారం జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జెసి గణేష్ కుమార్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డి మాట్లాడుతూ ఎఎన్ఎంలు, ఆశా, మెప్మా కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రజలకు జాగ్రత్తలు వివరించాలని తెలిపారు. డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ ఖాదర్‌వల్లి మాట్లాడుతూ డెంగీ జ్వరం ఎడిస్ ఈజిప్ట్ అనే దోమ వల్ల మూడు రకాలుగా వస్తుందని చెప్పారు. జిల్లా మలేరియా అధికారి మనోరమ మాట్లాడుతూ జాతీయ డెంగీ దినోత్సవం గురించి వివరించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ యధుభూషణ్‌రెడ్డి, మెప్మా పీడీ సురేష్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ వీరన్న, డిపిఒ ప్రభాకర్‌రెడ్డి, డిఐఒ డాక్టర్ మల్లేశ్వరి, ఎన్‌హెచ్ఎం డాక్టర్ లక్ష్మీర్, ఎన్‌సిడిసిడి కో–ఆర్డినేటర్ ఖాజా మొహిద్దీన్, వెంకటరెడ్డి, బాల పుల్లయ్య, మౌనికమ్మ, స్వయం సహాయ సభ్యులు పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నె : పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యవంతంగా ఉంటారని ఎంపిడిఒ రవికుమార్ రెడ్డి పేర్కొన్నారు, మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డెంగీ డే సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపిడిఒ హాజరై మాట్లాడారు. డ్రై డే ఫ్రైడే పాటించాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం స్థానిక మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాఘవేంద్ర మాట్లాడుతూ దోమలు కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, సురక్షితమైనటువంటి నీటిని తాగాలన్నారు. ఎండలకు వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ సునీత, సూపర్‌వైజర్లు మోహన్‌రెడ్డి, షణ్ముగ, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

జమ్మలమడుగు :దోమకాలు చాల ప్రమాదకరమని జిల్లా ఉపవైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.శాంతికళ తెలిపారు. మన ఇంట్లో, బయట పరిసరాల్లో పెరిగే దోమలతో మనకు మలేరియా, డెంగీ వ్యాధులు వస్తాయని తెలిపారు. మన కోసం మన కుటుంబం ఆరోగ్యం కోసం కొన్ని జాగ్రత్తలు పాటించాలని సూచించారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రాంతీయ ఆస్పత్రి వద్ద అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మలేరియా యూనిట్ అధికారి బి. సుబ్బరాజ, ఆస్పత్రి సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : సమర్థవంతమైన ప్రజల భాగస్వామ్యంతోనే డెంగీ వ్యాధిని నివారిద్దామని కామనూరు, కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ హనీఫ్‌బాబా, డాక్టర్ మహాలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా కామనూరు, సుబ్బారావు కొట్టాల, ఈశ్వరరెడ్డి నగర్, పెన్నానగర్‌లో అవగాహన సమావేశాలు, ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య నోడల్ అధికారి వెంకటేశ్వర్లు, సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు, సూపర్‌వైజర్ బిఎ వరప్రసాద్, సోములవారిపల్లె సచివాలయాల పంచాయతీల కార్యదర్శులు హరినాథ్, నాజీర్ హుస్సేన్, నూర్ మహమ్మద్, సిహెచ్ఒలు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠం : జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా బ్రహ్మంగారిమఠం, పలుగురాళ్లపల్లె ప్రాథమిక వైద్య సిబ్బంది వేర్వేరుగా ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో బి.మఠం వైద్యాధికారి పలనిరాజ్, పలుగురాళ్లపల్లె వైద్యాధికారులు చెన్నకేశవరావ్, ఝాన్సీ, సిహెచ్ఒ సాంబశివారెడ్డి, ఎంపీహెచ్‌ఈవో పీరయ్య, సూపర్వైజర్ పుష్పరాజ్, హెల్త్ అసిస్టెంట్ మాధవ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జమ్మలమడుగు : ర్యాలీలో డాక్టర్ పి.శాంతికళ, సిబ్బంది

కర్ఫ్యూను తలపిస్తున్న ఎండలు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మండుతున్న ఎండలను చూసి ప్రజలు బెంబేలెత్తుతున్నారు. సోమ, మంగళవారాల్లో ఎండలు అధికంగా ఉండడం చేత ప్రజలు హడలెత్తిపోతున్నారు. పట్టణంలోని ప్రధాన రహదారులైన తాడిపత్రి రోడ్డు, ప్రొద్దుటూరు రోడ్డు, ముద్దనూరు రోడ్డులో ఆటోలు, ఆర్‌టిసి బస్సులు తప్ప బయటకి ప్రజలు రావడంలేదు. రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఇదే సమయంలో పట్టణంలోని బండ్ల, గంప వ్యాపారులు వెలవెలబోతున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విపరీతమైన ఎండలు ఉన్నాయి. మధ్యాహ్నం ఒకటి మరియు రెండు గంటల మధ్యలో 43 డిగ్రీలు, 42 డిగ్రీలు, 41 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ క్రమంలో పచ్చి టెంకాయ వ్యాపారస్తులు ఒక్కో టెంకాయ రూ.50అమ్ముతున్నారు. ఎండలతో ప్రజలు బయట తిరగడానికి భయపడుతున్నారు. ఒకవైపు ప్రభుత్వం కూడా సెల్‌ఫోన్లకు సమాచారం అందిస్తూ బయటకి అవసరమైతేనే రావాలని సూచిస్తోంది. ఎండాకాలంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, కూలీలు అప్రమత్తంగా ఉండాలి.

నిర్మానుష్యంగా ఉన్న గాంధీ బొమ్మ సర్కిల్

వడదెబ్బతో జాగ్రత్త సుమా..!

ప్రజాశక్తి - జమ్మలమడుగు

వేసవిలో వడదెబ్బ తగలకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ వి.కిరణ్‌కుమార్ తెలిపారు. వేసవి కాలంలో ఎండల తీవ్రత వల్ల వడదెబ్బ తగిలి నీరసపడి పోవడం, ఆరోగ్యం క్షీణించడం, కొంత మంది మృత్యువాత పడడం తెలిసిందే. ఎండ తీవ్రత వల్ల శరీర ఉష్ణోగ్రత పెరిగి (104.9 డిగ్రీల ఫారన్‌హీట్) మెదడు మీద ప్రభావం చూపుతుందని డాక్టర్ వివరించారు. **దీనివల్ల..** మెదడులోని ఉష్ణోగ్రత నియంత్రించే కేంద్రం (హైపో థలామస్) దెబ్బతిని వడదెబ్బకు గురవుతారు. దీనినే 'హీట్ స్ట్రోక్' లేదా 'సన్ స్ట్రోక్' (వడదెబ్బ) అని అంటారు. ఇది ప్రమాదకరం, ప్రాణాతకం. **వడదెబ్బ లక్షణాలు:** చెమట పట్టకపోవటం, శరీర ఉష్ణోగ్రత పెరగడం, వణకు పుట్టడం, మగత నిద్ర లేదా, కలవరింతలు, ఫిట్స్ లేదా పాక్షికంగా అపస్మారక స్థితికి వెళ్లడం జరుగుతుంది. **వడదెబ్బ తగలడానికి ముఖ్య కారణాలు :** శరీరంలో ఎక్కువ వేడి ఉత్పత్తి కావడం, శరీరం ఉష్ణాన్ని కోల్పోవడం. వాతావరణ వేడికి శరీరం ఎక్కువసేపు గురైతే చెమట పట్టి శరీరంలోని లవణాలు (సోడియం క్లోరైడ్) తగ్గిపోవడం లేక శరీరంలో నీటి నిష్పత్తి తగ్గిపోవడం సంభవిస్తుంది. అధిక ఉష్ణోగ్రత ఉన్న ప్రదేశాల్లో ఎక్కువ శ్రమతో కూడిన పనులు చేస్తున్నప్పుడు ప్రతిగంటకు మూడు లేక నాలుగు లీటర్ల నీటిని చెమట రూపంలో మన శరీరం కోల్పోతుంది. **ముందుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు :** ఎండలో బయటకు వెళ్లేటపుడు గొడుగు వాడాలి. తెలుపు రంగు, పలుచటి చేనేత వస్త్రాలను ధరించడం, తలకు టోపీ లేదా రుమాలు వాడడం, వేడిగాలులు తగలకుండా చూసుకోవడం చేయాలి. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఆరు బయట అధిక శారీరక శ్రమతో కూడిన పని చేయకుండా ఉండడం మంచిది. శీతల పానీయాలు, మంచు ముక్కలు తీసుకుంటే గొంతుకు సంబంధించిన అనారోగ్యం ఏర్పడు తుంది. ఇంటి నుండి బయటకు వెళ్లేటప్పుడు ఒక గ్లాసు మంచినీరు తాగడం, వీలైనన్ని సార్లు మంచినీరు తాగాలి. అనారోగ్య సమస్యలు ఏర్పడితే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. ఎండలో తిరిగే సమయంలో చల్లని నిమ్మరసం, కొబ్బరి నీళ్లు, చల్లని మంచినీరు తాగడం చేయాలి.

డాక్టర్ వి.కిరణ్‌కుమార్

రామాలయానికి మకర తోరణం విరాళం

ప్రజాశక్తి - కొండాపురం

మండలంలోని సిరిగేపల్లె గ్రామంలో శ్రీ సీతారామ దేవస్థానం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా మంగళ వారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిం చారు. స్వాముల వారికి అదే గ్రామానికి చెందిన అల్లపురెడ్డి రామకృష్ణారెడ్డి రూ. 20వేల ఖర్చుతో మకరతోరణాలు చేయిం చినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిం చారు.

దాత అల్లపురెడ్డి రామకృష్ణారెడ్డి

సేంద్రియ ఎరువుకు భలే గిరాకీ

ప్రజాశక్తి - చాపాడు

గ్రామాల్లో సేంద్రియ ఎరువుకు గిరాకీ ఏర్పడుతోంది. రాబోయే ఖరీఫ్ సీజన్‌కు రైతులు దుక్కులు చేపట్టి సేంద్రియ ఎరువులను పంట పొలాల్లో చల్లకం చేస్తున్నారు. ఆవులు, గేదెల పేడను నిల్వ ఉంచిన దిబ్బలను సేంద్రియ ఎరువులుగా రైతులు వినియోగించడం తెలిసిన విషయమే. అయితే రసాయనిక ఎరువుల వాడకం పెరిగిన తర్వాత సేంద్రియ ఎరువుల వినియోగం తగ్గుముఖం పట్టింది. అయితే ప్రస్తుతం ప్రకృతి వ్యవసాయంపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. అందులో భాగంగా ఆవుల, గేదెల పేడను పంట పొలాలకు అధికంగా ఉపయోగిస్తున్నారు. ఎరువుల దిబ్బలను కొనుగోలు చేసి పంట పొలాలకు తరలిస్తున్నారు. ఇతర ప్రాంతాల నుండి కూడా రైతులు ఎరువుల దిబ్బలను కొనడానికి వస్తున్నారు. ట్రాక్టర్ ఎరువుల పేడ రూ.4 వేల నుంచి రూ.5వేల వరకు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. రైతులు ఎక్కడ చూసినా వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతున్నారు. అందులో భాగంగా విత్తనాల సేకరణ, పచ్చిరొట్ట ఎరువుల సాగు, ఎరువుల చల్లకం, దుక్కులు వంటి పనుల్లో నిమగ్నమయ్యారు. ఆగస్టు మొదటి వారంలో కెసి కాలువకు నీరు విడుదలయితే వరి సాగు చేసేందుకు సిద్ధపడుతున్నారు. కుందూ పరివాహక గ్రామాల్లో ఇప్పటికే పసుపు, పత్తి వంటి ఇతర ఆరుతడి పంటలు రైతులు సాగు చేపట్టే చర్యలు తీసుకుంటున్నారు.

సేంద్రియ ఎరువును ట్రాక్టర్‌లో తరలిస్తున్న రైతులు

కల్యాణ మండపం నిర్మాణానికి వితరణ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మండల పరిధిలోని నంగనూరుపల్లె గ్రామంలోని శివాలయం ఎదురుగా నిర్మిస్తున్న కల్యాణ మండపానికి అవసరమైన సహాయ సహకారాలను అందిస్తానని ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆ మేరకు మంగళవారం ఆ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఇప్పటి వరకు సుమారు రూ.15 లక్షల మేర పనులు పూర్తయినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ కళ్యాణ మండప నిర్మాణానికి రూ.60 లక్షలు ఖర్చవుతున్నట్లు వివరించారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి తన వంతు సాయంగా రూ.30 లక్షలు అందిస్తానని తెలిపారు. ముందుగా ఎమ్మెల్యే రూ.10 లక్షలను తక్షణ సాయంగా అందజేశారు. ఎమ్మెల్యే వితరణపట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపిపి శేఖర్ యాదవ్, యాలం శంకర్ యాదవ్, వేణు, నాగేంద్ర, భావన గృహ నిర్మాణ సొసైటీ చైర్మన్ గోపిరెడ్డి రమణయ్య, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ యాలం తులసమ్మ, ఎంపిటిసి క్రిష్టిపాటి సంధ్య, మంజు నాథ శర్మ, గ్రామ సర్పంచు శావలి లక్ష్మీదేవి, వెంకటరాముడు పాల్గొన్నారు.

నగదు అందిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు

పర్యావరణాన్ని పరిరక్షించాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిపి సంరక్షించాలని డిప్యూటీ ఎఫ్ఆర్ఒ చంద్రశేఖర్ రావు అన్నారు. మండలంలోని యామవరం, ముద్దనూరు సచివాలయాల వద్ద మంగళవారం అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. మానవాళి మనుగడకు చెట్లు జీవనాధారమని తెలిపారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టాల గురించి, నీరు, కరెంట్, పొదుపు, పర్యావరణం, క్లీన్‌అండ్‌గ్రీన్‌పై అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సిబ్బంది రత్నరాజు, సుబ్బయ్య, నారాయణస్వామి, పద్మనాభయ్య పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న అటవీ సిబ్బంది

స్థల పరిశీలనలో అధికారులు

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండల కేంద్రంలో బస్టాండ్, శ్మశానం వెళ్లుటకు దారి ఏర్పాటుకు మంగళవారం ట్రైనీ కలెక్టర్ రాహుల్ మీనా, తహశీల్దార్ ఈశ్వరయ్య, ఎంపిపి వీరనారాయణరెడ్డి స్థలాన్ని పరిశీలించారు. సర్వే నెంబర్ 1430లో బస్టాండ్ కోసం స్థలాన్ని పరిశీలించారు. 1437 సర్వే నెంబర్ నుంచి శ్మశానికి వెళ్లుటకు దారి ఏర్పాటుపై అధికారులు పరిశీలించారు. సోమిరెడ్డిపల్లి సహకార పరపతి సంఘం చైర్మన్ సుబ్బారెడ్డి, మండల సర్వేయర్ వెంకటలక్ష్మి, విఆర్ఒ కాశిరెడ్డి, నేలటూరు వైసిపి నాయకులు వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

స్థలాన్ని పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్, అధికారులు

కళలు, క్రీడల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

నేటి యువత చదువుతోపాటు కళలు, క్రీడల్లోనూ రాణించాలని స్టెప్ ముఖ్య కార్య నిర్వహణ అధికారి సాయిగ్రేస్, స్టెప్ మేనేజర్ వివి సుబ్బరాయుడు సూచించారు. స్థానిక ఐటిఐ కళాశాలలో మంగళవారం వ్యక్తిత్వ వికాసం, కెరీర్ కౌన్సిలింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రైనింగ్ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కెవికె శాస్త్రవేత్త డాక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మంచి అలవాట్లతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలన్నారు. చదువు, కళలు, క్రీడలు పట్ల ఏకాగ్రత కలిగి మంచి ఉన్నత స్థితికి ఎదగాలన్నారు. ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపల్ మేరీ ఫ్లోరెన్స్, అధ్యాపకులు విజయ్‌కుమార్‌రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఐటిఐ విద్యార్థులు దాదాపు 155 మందితోపాటు మైలవరం, ప్రభుత్వ ఐటిఐ కె.మంతేసుల, ట్రైనింగ్ అధికారులు వరప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

బహుమతులు అందజేస్తున్న స్టెప్ కార్యనిర్వహణాధికారి

బిటెక్, ఎంబిఎ ఫలితాల్లో సిబిఐటి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - చాపాడు

2022–23 విద్యాసంవత్సరం అటానమస్ బ్యాచ్‌కు చెందిన ఇంజనీరింగ్ ప్రథమ సంవత్సర మొదటి సెమిస్టర్, ఎంబిఎ మొదటి సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో స్థానిక చైతన్య భారతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కలశాల విద్యార్థులు ఉన్నత స్థాయి ఫలితాలను సాధించారు. అనంతపురం జెఎన్‌టియు ప్రొఫెసర్ యం.సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఈ ఫలితాలను విడుదల చేశారు. తమ కళాశాల విద్యార్థులు సాధించిన ఈ విజయం పట్ల చైర్మన్ డాక్టర్ వి.జయచంద్రారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులరెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

ఫలితాల జాబితాతో కళాశాల సిబ్బంది

నేడు ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

ప్రజాశక్తి - దువ్వూరు

స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో బుధవారం మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం సామాజిక తనిఖీ ఉంటుందని ఉపాధి ఎపిఒ రామచంద్రారెడ్డి తెలిపారు. 2022 –23 వరకు జరిగిన పనులపై బహిరంగ సభ ఉంటుందన్నారు. కార్యక్రమానికి ప్రజలు, రైతులు, ఉపాధి హామీ సిబ్బంది, దాని అనుబంధ సంస్థ శాఖలు తప్పక పాల్గొనాలని ఆయన కోరారు.

మానవత్వం చాటుకున్న మే ఐ హెల్ప్‌యు ఫౌండేషన్

- రెండు మృతదేహాలకు అంత్యక్రియలు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

మండలంలోని మోరగుడి గ్రామంలో నివసిస్తున్న జానపటి లక్షుమ్మ అనే మహిళ అనారోగ్యంతో మృతి చెందగా.. స్థానికులు మేఐహెల్ప్‌యు ఫౌండేషన్ చైర్మన్ లక్ష్మణ్‌రావుని సంప్రదించారు. ఆ మేరకు ఫౌండేషన్ సభ్యులు హిందూ శ్మశాన వాటికలో సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. జమ్మల మడుగు మండలం దేవ గుడి గ్రామంలో నివసిస్తున్న సిరివేళ్ళ ప్రభావతి అనే మహిళకు కూడా అంతక్రియలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో చైర్మన్ లక్ష్మణ్‌రావు, కామనూరు శివసాయినాథ్, సుబ్బయ్య, తిరుపాల్, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

అంత్యక్రియలు నిర్వహిస్తున్న ఫౌండేషన్ సభ్యులు